ప్రజాశక్తి
ఆదివారం 23 ఫిబ్రవరి, 2025
5
శ్రీకాకుళం



చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇంటింటా చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు డిపిఒ కె.భారతీసౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలిపారు. రెండు రోజుల పాటు అధికారులంతా క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఉదయం 6 గంటలకే అధికారులంతా పంచాయతీల్లో విధులకు హాజరయ్యేలా చూడాలన్నారు. రెండు రోజుల్లో వంద శాతం చెత్త సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని చెత్త కుప్పలు, రోడ్ మార్జిన్, రోడ్ పక్కన పశువుల పేడదిబ్బలు తొలగించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. సేకరించిన చెత్త సేకరణ వివరాలను పీఆర్ ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు.

నేడు గ్రూప్-2 మెయిన్ పరీక్ష

- నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో 15 కేంద్రాల్లో ఆఫ్‌లైన్ పరీక్ష
- హాజరుకానున్న 5,535 మంది అభ్యర్థులు



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 23న నిర్వహించనున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 23న ఉదయం 10 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు గ్రూప్-2 పరీక్ష నిర్వహించేందుకు కేంద్రాలను సిద్ధం చేశారు. పరీక్ష నిర్వహణకు శ్రీకాకుళం, ఎచ్చెర్ల కేంద్రాల్లో 15 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 5,535 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

పరీక్షా కేంద్రాల్లో వెలుతురు బాగా ఉండే విధంగా తరగతి గదులను ఎంపిక చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా కేంద్రాల పరిధిలో పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ప్రతి కేంద్రం వద్దా అభ్యర్థులకు అనువుగా తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా విద్యుత్‌శాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ముందు జాగ్రత్తగా జనరేటర్లను అందుబాటులో ఉంచారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్షా కేంద్రం వద్దా వైద్య శిబిరాలను సిద్ధం చేశారు. అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అంబులెన్స్‌లను సిద్ధం చేశారు. ఒక్కో కేంద్రంలో ఇద్దరు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలను నియమించి మందులను అందుబాటులో ఉంచారు. సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్‌టిసి ప్రత్యేక బస్‌లను వివిధ రూట్లలో నడుపుతోంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి పేపరు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండో పేపరు పరీక్ష జరగనుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అర గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాయడానికి అనుమతించరు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సంబంధించి సందేహాలు నివృత్తి చేయడానికి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం ఫోన్ నంబరు 08942 240557 అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్, మొబైల్ ఫోన్, స్మార్ట్ వాచ్, బ్లూ టూత్ వంటి పరికరాలను పరీక్షా కేంద్రాలోకి అనుమతించరు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు వంటి వాటిలో ఏదైనా ఒక గుర్తింపు కార్డును పరీక్షా కేంద్రం వద్ద తనిఖీ సమయంలో చూపాల్సి ఉంటుంది. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డిలు స్వయంగా పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలను ఎపిపిఎస్‌సి అధికారులతో పాటు కేంద్రాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రశాంత వాతవరణంలో పరీక్షలు జరగాలని ఆదేశించారు.

శాసనమండలిలో మీ గొంతుకనవుతా..

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి



రణస్థలం : మాట్లాడుతున్న విజయగౌరి

ప్రజాశక్తి- రణస్థలం, జి.సిగడాం, పూసపాటిరేగ, రాజాం,

ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గొంతు వినిపిస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యరి పిడిఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శనివారం విజయనగరం జిల్లా పూసపాటిరేగ, రాజాం, శ్రీకాకుళం జిల్లా రణస్థలం, జి.సిగడాం మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. 33ఏళ్లగా నిజాయితీ, నిబద్ధతతో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన ఆరేళ్ల సర్వీసును వదిలేసి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని, ఒక్క అవకాశం ఇస్తే ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో వినిపిస్తానని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా ఉపాధ్యాయ పోస్టులు, పాఠశాలలు తగ్గిపోయాయని తెలిపారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ పోస్టులను తగ్గిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్ విద్యారంగంపై ప్రభుత్వ తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాట ఫలితంగానే కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెరిగాయని అన్నారు. ఈ సందర్భంగా 117 జిఒను పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివాసీలకు ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నంబరు 3ను పునరుద్ధరించడానికి శాసన మండలిలో గొంతెత్తుతానన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల గొప్పతనాన్ని గుర్తుచేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడం, 12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించడం, ఆర్థిక బకాయిలు చెల్లింపు, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులను రెగ్యులర్ చేయడం, తదితర డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో జిఒ 114 అమలుకు పని చేస్తానన్నారు. కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయడానికి, రెగ్యులర్ చేయడానికి తనవంతు ప్రయత్నిస్తానని తెలిపారు. జిఒ 3 పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు. పెద్దల సభను రాజకీయ సభగా మార్చొద్దు అని, పెద్దల సభకు పోరాటపటిమ కలిగి, విద్యారంగ సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి ని పంపాలని కోరారు. ప్రచారంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రణస్థలంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ సాల్ట్ పథకం వల్ల ప్రాథమిక పాఠశాలలు బలహీనపడితే భవిష్యత్‌లో ఉన్నత పాఠశాలలుకూడా బలహీనపడతాయని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.నారాయణరావు, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, కోదండ రామయ్య, గౌరవాధ్యక్షులు డి.కోటేశ్వరరావు, మల్లేశ్వరరావు, సంతోష్‌కుమార్, రాంప్రసాద్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

జి.సిగడాంలో యుటిఎఫ్ నాయకులు గొరేశ్వరరావు, రెడ్డి మోహన్, జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వెలమల రమణ, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి పక్కాగా ఏర్పాట్లు

- యాత్రికులకు ఇబ్బందులు ఉండరాదు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- జలుమూరు

శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. దర్శనాలకు వచ్చే యాత్రికుల ఇబ్బందులు ఉండరాదన్నారు. ఈ నెల 26న శివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులు పాటు నిర్వహించనున్న మహోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో శనివారం అధికారులతో సమీక్షించారు. దర్శనాలకు వచ్చే యాత్రికులు ఎంత మంది వస్తుంది తదితర వివరాలను ఇఒ ప్రభాకరరావును అడిగి తెలుసుకున్నారు. లైటింగ్, డెకరేషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి సౌకర్యం అంతా చూసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎహసాన్ భాషాతో ఎంత జనాభాకు ఎంత తాగునీరు అవసరమో చర్చించి తెలియజేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లు మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఉండాలని చెప్పారు. మొబైల్ మరుగుదొడ్లు ఎనిమిది అవసరం అవుతాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి శానిటేషన్ చేయించాలన్నారు. యాత్రికులు ఎక్కడ నుంచి వస్తుంది అడగ్గా, టెక్కలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, సరుబుజ్జిలి, కొమనాపల్లి, ఆమదాలవలస, హిరమండలం, గొట్టాబ్యారేజీ, కరకవలస, పాలకొండ, రాయిఘడ్ తదితర ప్రాంతాల యాత్రికులు వస్తారని ఇఒ కలెక్టర్‌కు వివరించారు. శ్రీముఖలింగానికి అందుబాటులో ఉన్న చల్లవానిపేట కూడలి, కొమనాపల్లి, కరకవలస పంచాయతీల నుంచి క్లీనింగ్‌కు సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిపిఒను ఆదేశించారు. మెడికల్ టీం 4, ఆంబులెన్లు 4 ఉండాలని డిఎంహెచ్‌ఒ బాలమురళీకృష్ణకు సూచించారు. మెడికల్ టీంలు 24 గంటలు ఉండాలని చెప్పారు. చల్లవానిపేట కూడలి వద్ద పార్కింగ్‌కు స్థలం ఉందని టెక్కలి డిఎస్‌పి ఎవిఎస్‌ఎన్ మూర్తి కలెక్టర్‌కు వివరించారు. యాత్రికుల నియంత్రణకు బారీకేడింగ్, నది వద్ద లోపలి కొంత వరకు ఉండాలని చెప్పారు. వచ్చే యాత్రికుల రక్షణ కోసం సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నదిలో ఎంతవరకు వెళ్లాలనేది లిమిట్ ఉంటుందని చెప్పారు. కంట్రోల్ రూం ఎక్కడ ఏర్పాటు చేశారని డిఎస్‌పిని అడిగి తెలుసుకున్నారు. వంశధార నది నీరు ఎంత ఉన్నదీ ఎస్‌ఇని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశిస్తూ జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌టిసి డిఎం శర్మ మాట్లాడుతూ యాత్రికుల రవాణాకు ఇబ్బందులు లేకుండా బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని చెప్పారు. నది వద్ద మహిళలు స్నానాలు అనంతరం డ్రస్ ఛేంజింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇని ఆదేశించారు. అనంతరం ఆలయంలో యాత్రికుల ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల పరిశీలించారు. సమావేశంలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయిప్రత్యూష, టెక్కలి డిఎస్‌పి ఎవిఎస్‌ఎన్ మూర్తి, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌పట్నాయక్, తహశీల్దార్ రామారావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, మాజీ సర్పంచ్ తర్ర బలరాం పాల్గొన్నారు.



మాట్లాడుతూ డిఐజి గోపీనాథ్ జట్టి

కేసుల దర్యాప్తులో నైపుణ్యమే కీలకం

విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

గంజాయి అక్రమ రవాణా, ఇతర మాదక ద్రవ్యాల కేసుల్లో పటిష్టంగా దర్యాప్తు చేపట్టి శిక్షలు శాతం పెరిగేలా దర్యాప్తు చేయాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి పోలీసు అధికారులకు దిశ నిర్దేశాలు చేశారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసు అధికారులతో గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో చట్టపరమైన నిబంధనలు, పాటించాల్సిన నియమాలు, నైపుణ్యంపై ఎస్‌పి కె.వి.మహేశ్వరరావు అధ్యక్షతన శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రిబ్యూనల్ అధికారి ఎ.రంగథామ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాధాన్యతా అంశాల్లో గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమైన అంశమని అన్నారు. ఆ దిశగా గంజాయి రవాణా, వ్యాపారస్తులు మూలాలు కనిపెట్టి కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నేరస్తులకు శిక్షలు పడే విధంగా దర్యాప్తును పూర్తిస్థాయిలో చేయాలన్నారు. అలాగే నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ ఎంతో కష్టపడి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న గంజాయిని పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. అనంతరం రంగథామ్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, పార్వతీపురం మన్యం ఎఎస్‌పి అంకిత సురాన, డిఎస్‌పిలు వి.వి.అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎం.రాంబాబు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు సెలవు

- ప్రయివేటు యాజమాన్య పరిధిలో పని సర్దుబాటు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 27న రాష్ట్ర ఎన్నికల సంఘ ఉత్తర్వుల మేరకు ప్రత్యేక సాధారణ సెలవు (స్పెషల్ క్యాజువల్ లీవ్) మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పై ఎన్నికలకు ఓటు హక్కు కలిగి ఉన్న ప్రయివేటు యాజమాన్యాలు, సంస్థల్లో పనిచేస్తున్న వారి ఉద్యోగులకు అవసరమైన సౌకర్యాలను మంజూరు చేయాలని తెలిపారు. పోలింగ్ రోజున వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా విధులకు ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతి, షిఫ్ట్‌ల సర్దుబాట్లు, తక్కువ సమయం డ్యూటీ గంటలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

నందిగాం : మండలం దేవపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కొండాల గోపాలం తమపై అసభ్యంగా ప్రవర్తిస్తూ... వేధిస్తున్నారని విద్యార్థినులు ఈ నెల 20న తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు శనివారం ఉదయం ప్రధానోపాధ్యాయులు వై.గణపతిరావుకు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం ఎంఇఒ జి.నరసింహులకు ఫిర్యాదు చేయడం, తరువాత డిఇఒకు సమాచారం అందజేశారు. వెంటనే డిఇఒ పాఠశాలను సందర్శించి విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. వివరాలు తెలుసుకొని విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఉపాధ్యాయుడు గోపాలంను సస్పెండ్ చేస్తూ... డిఇఒ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో డిఇఒ-2 ఎ.చిన్నారావు, తహశీల్దార్ పి.సోమే శ్వరరావు, డిటి ఆర్.రామారావు, విఆర్‌ఒ దేవేందర్ పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

ఉత్సాహంగా క్రీడా పోటీలు

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా శనివారం జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలను సెట్‌శ్రీ సిఇఒ వి.వి.ప్రసాదరావు, నెహ్రూ యువక కేంద్ర డిడి కె.వెంకట్ ఉజ్వల్ ప్రారంబించారు. క్రీడాకారులు వాలీబాల్, కబాడీ బ్యాడ్మింటన్, వంద మీటర్ల రన్నింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి సంస్థ అధికారి శ్రీధర్‌రావు, నెహ్రూ యువ కేంద్ర గణాంకధికారి డి.శ్రీనివాస రావు, కోచ్‌లు, మూలపేట వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు గుజ్జల ఉమామహేశ్వరరావు, ఝాన్సీ అగ్రికల్చర్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రౌతు సుమతీ మోహన్ పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. బ్యాడ్మింటన్ మొదటి బహుమతి రాజేశ్వరి, రెండో బహుమతి జి. శరణ్య, అథ్లెటిక్స్ మహిళలు మొదటి బహుమతి సిహెచ్.భార్గవి, రెండో బహుమతి బి.హారిక, అథ్లెటిక్స్ పురుషులు మొదటి బహుమతి టి.యోగేశ్వరరావు, రెండో బహుమతి గార మండలం జి.శంకర్, కబాడ్డీలో మొదటి బహుమతి కె.శంకర్ టీమ్, రెండో బహుమతిని పవన్‌కుమార్ టీమ్, వాలీబాల్ పోటీలో మొదటి బహుమతి మందస మండలం బి.సాయి రాఘవేంద్ర, రెండో బహుమతి గార మండలం ఎ.రాజేష్ టీమ్‌లు గెలుపొందారు.




పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ప్రచారంలో 'విజయ' ఉత్సాహం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు మరో వారం రోజులే ఉండటంతో ప్రచారం పతాక స్థాయికి చేరింది. అభ్యర్థులు వారికి మద్దతు పలుకుతున్న ఆయా సంఘాలు ఇంటింటా ప్రచారం చేపడుతున్నారు. దీంతో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఓటు హక్కు కలిగిన ఇతర ఓటర్లు పనిచేస్తున్న పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి వారితో మాట్లాడి ఓట్లను అభ్యర్థిస్తున్నాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో మొత్తం పది మంది పోటీలో ఉన్నారు. ప్రధాన పోటీ పిడిఎఫ్ (ప్రొగ్రెసివ్ డెమొక్రటివ్ ఫ్రంట్) అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ఎపిటిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న సిటింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు తరుపున రంగంలో దిగిన మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల జోక్యం ఈ సారి మరింత ఎక్కువైంది. శాసనమండలిలో పట్టుకోసం రాజకీయ పార్టీలు, గెలుపు తప్ప నైతిక విలువలు అవసరం లేదని భావించే కొందరు కూటమి పార్టీల మద్దతు కోరడం ఈ సారి ఎన్నికల్లో విశేషంగా ఉంది. తొలుత ఎపిటిఎఫ్ తరుపున రంగంలోకి దిగిన పాకలపాటి రఘువర్మ ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి టిడిపి మద్దతు కోరినట్లు ప్రచారం సాగుతోంది. అంటే ఆయన కూటమిలోని టిడిపి అభ్యర్థిగా పోటీలో ఉన్నట్లు చూడాల్సి ఉంటోంది. పిఆర్‌టియు తరుపున పోటీకి దిగిన గాదె శ్రీనివాసులు నాయుడుకు బిజెపి మద్దతు ఇస్తున్నట్లు బహిరంగంగానే ప్రచారం సాగుతుంది. దీంతో ఆయన బిజెపి అభ్యర్థిగా బరిలో ఉన్నట్లుగానే పరిగణించాలి. అసెంబ్లీ ఎన్నికల ముందు జత కట్టిన మూడు పార్టీల్లో టిడిపి, బిజెపి పార్టీలు మండలి ఎన్నికల దగ్గరకొచ్చేసరికి ఎవరి దారి చూసుకుంటున్నాయి. మండలిలో పట్టు కోసం టిడిపి, ఉనికి కోసం బిజెపి ఆరాటపడుతున్నాయి. వీరి రాజకీయాలను, వాటి మద్దతు తీసుకుంటున్న అభ్యర్థుల తీరుపై ఉపాధ్యాయులు నిశితంగా పరిశీలిస్తున్నారు.



శాసనసభలో కూటమికి 164 సీట్లు ఉండగా, టిడిపి 134 స్థానాల బలం ఉంది. ఇవి చాలవనట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుతున్న ప్రాంతాల మంత్రులు, ఎమ్మెల్యేలతో రెండు మూడు సార్లు సమావేశాలు నిర్వహించి ఎలాగైనా గెలవాలని వారికి దిశా నిర్ధేశం చేస్తున్నారు. సాధారణ ఎన్నికల తర్వాత జరగుతున్న ఎన్నికలు కావడంతో బాబు ఎన్నికలను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఎలాగైనా గెలవాలనే చెప్పడం వెనుక అంతరార్థం ఏమై ఉంటుందా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రలోభాలకు గురి చేస్తారా? లేక అధికార బలంతో ఒత్తిళ్లకు గురి చేస్తారా అన్న అనుమానాలు సహజంగానే అందరిలోనూ కలుగుతాయి. అయితే మేధావి వర్గానికి చెందిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇటువంటి వాటికి లొంగరని చాలాసార్లు రుజువైంది. టిడిపి కూటమి ప్రభుత్వంపై సాధారణ ప్రజానీకంతో పాటు ఉపాధ్యాయుల్లోనూ తీవ్ర అసంతృప్తి, అసహనం ప్రబలుతోంది. ముఖ్యంగా ఇటీవల విడుదల చేసిన 117 జిఒతో ప్రాథమిక విద్యారంగానికి అసలుకే ఎసరు తెచ్చే పెట్టేలా ఉందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. దీంతో పాటు ఎనిమిది నెలల పాలనలో ఉపాధ్యాయులకు మేలు చేసే ఒక్క నిర్ణయమూ ప్రభుత్వం ప్రకటించలేదు. పిఆర్‌సి, ఐఆర్ వంటి అంశాలపై ప్రభుత్వం మాట్లాడం లేదు. కనీసం డిఎ కూడా ఇవ్వకపోవడంతో వారిలో అంతర్లీనంగా ఆగ్రహం గూడు కట్టుకుని ఉంది.

శాసనసభలో టిడిపి కూటమి ప్రభుత్వానికి 164 సంఖ్యా బలం ఉంది. వైసిపికి 11 సీట్లు ఉన్నాయి. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదనే కారణంతో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వెళ్లకపోవడంతో శాసనసభలో ప్రతిపక్షమే లేకుండా పోయింది. అసెంబ్లీలో కూటమి పార్టీలు ఆడిందే ఆటగా పాడిందే పాటగా సాగుతోంది. ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపినా ఒక్క ఎమ్మెల్యే నోరెత్తలేదు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, నిరుద్యోగులకు ఏటా జనవరిలో జాబ్ కేలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చినా ఎప్పుడు అమలు చేస్తారని అడిగేవారే కరువయ్యారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలపైనా ప్రశ్నించడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. ఇటువంటి తరుణంలో సమస్యలపై ప్రశ్నించే వేదికగా ఉన్న శాసనమండలే ఒక ప్రత్యామ్నయంగా ఉంది. అందులో వివిధ కోటాల్లో వచ్చిన అన్ని పార్టీలకు చెందిన ఎమ్మెల్సీలూ ఉన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలో దూకేయడమూ మనం చూస్తున్నాం. పిడిఎఫ్ తరుపున ఎన్నికైన ఎమ్మెల్సీలు మాత్రం అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజలు ముఖ్యంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులు, పట్టభద్రుల సమస్యలే ఎజెండాగా గళం ఎత్తుతున్న పరిస్థితిని సమావేశాల సందర్భంగా మనం చూస్తున్నాం. శాసనమండలిలో ఆయా తరగతుల గొంతు వినిపించడంతో పాటు ఉద్యమాలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా భాగస్వామ్యమవుతున్నారు. ఒక ప్రత్యామ్నాయ విధానం కోసం ఫ్రంట్‌గా ఏర్పడి పోరాటం సాగిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గత కొన్నేళ్లుగా అందరి ఆదరాభిమానలను చూరగొంటున్నారు. దీంతో ప్రస్తుతం పిడిఎఫ్ తరుపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కోరెడ్ల విజయగౌరికి పిడిఎఫ్ పోరాటాలు కలిసొస్తాయనే చర్చ జోరుగా సాగుతోంది. ప్రచారంలోనూ ఆ విధమైన సానుకూల స్పందన కనిపించడం విజయానికి సంకేతాలుగా ఆమెకు మద్దతు పలకుతున్న ఐక్య ఉపాధ్యాయ, అన్ని ప్రజా, కార్మిక, ఇతర సంఘాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

విజయగౌరికే మొదటి ప్రాధాన్యత ఓటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఐటిఐ ఉద్యోగుల సంఘం మాజీ నాయకులు విటి తోడర్‌మల్లు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఇన్‌స్ట్రక్టర్లు, బోధకులతో సమావేశ మయ్యారు. ఉపాధ్యాయ, అధ్యాపక, నిరుద్యోగుల సమస్యలపై గత కొన్నేళ్లుగా పిడిఎఫ్ సాగిస్తున్న పోరాటాలను గుర్తు చేశారు. మండలిలో సమర్ధవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పిడిఎఫ్‌కు మద్ధతు పలకాలని ఆయన కోరారు. మేథావుల సభకు పోరాటం చేసే నాయకులను పంపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రామ్మోహన్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి కోసం నిరసన

టెక్కలి రూరల్ : టెక్కలి పట్టణంలో ఎన్‌టిఆర్ కాలనీ 8 లైన్‌లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇటీవల కుళాయి పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో కాలంలో తాగునీటిని నిలుపుదల చేశారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో శనివారం బిందెలతో వీధి మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. తక్షణమే తాగునీటి పైపులైన్ ద్వారా సరఫరా చేయాలని సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గేదెల సుబ్రహ్మణ్యం, తలగాన ఉగాది, నరసమ్మ, సావిత్రి, లక్ష్మణరావు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న డాక్టరు శ్రీధర్

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువత అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని జనసేన నాయకులు, ప్రముఖ గైనిక్ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ ఆకాంక్షించారు. నగరంలోని జానకిరామ్‌నగర్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ స్టడీ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఇటువంటి స్టడీ సెంటర్లను వినియోగించుకొని తాము అనుకున్న లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య విజయాలను అందిస్తుందన్నారు. యువతే దేశానికి వెన్నుముకని, ఎక్కడైతే యువత సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తారో ఆ దేశం అభివృద్ధి సాధిస్తారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టి సారిస్తూనే స్వయం ఉపాధిపై కూడా దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు స్టడీ సెంటర్లకు రావడం ద్వారా వారికి కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. గతంలో విశాఖపట్నం, రాజమండ్రి వంటి ప్రాంతాల్లో ఇటువంటి స్టడీ సెంటర్లు ఉండేవని, శ్రీకాకుళంలో స్టడీ సెంటర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.


మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజ్

ఎంపిడిఒ కార్యాలయం సందర్శన

జి.సిగడాం: మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి శ్రీధర్ రాజ్ శనివారం సందర్శించారు. ఇందులో భాగంగా కార్యాలయంలో రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వాటర్ స్కీమ్స్ పోస్టర్లు అంటించాలని సూచించారు. రహదారుల సూచికలు పెట్టాలని ఆదేశించారు. మండల కేంద్ర సిబ్బంది, సచివాలయం సిబ్బంది సమయ పాలన పాటించకపోతే చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ జి.రామకృష్ణారావుకు ఆదేశించారు.

కళ్లద్దాల పంపిణీ

పొందూరు: మండలం రాపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పలువురు విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. పాఠశాలలో పలువురు విద్యార్థులకు ఆప్తాలమిక్ అధికారి రామచంద్రరావు ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించగా నేత్ర సమస్యతో బాధపడుతున్న 13 మంది విద్యార్థులకు కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వాణికుమారి, హెచ్‌ఎం సిహెచ్ శారదాంబ, హెల్త్ అసిస్టెంట్ రమణ, ఎఎన్ఎంలు ఉదయ్ లక్ష్మి, వనజాక్షి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కళ్లద్దాలతో విద్యార్థులు, వైద్య సిబ్బంది

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం


ఆమదాలవలస : వినతిపత్రం అందజేస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ల సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస

అర్హత కలిగిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ మండలాలతో పాటు మున్సిపాలిటీకి చెందిన ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందించారు. అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులకు ఫోన్ ద్వారా సమస్యను వివరించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అర్జీని అర్హతను బట్టి నిర్ణీత సమయంలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయని, 2008 నుంచి 2021 వరకు ప్రజలకు సేవలు అందించామని, 2021 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు జీతభత్యాలు ఇవ్వకుండా శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల్లోని అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందిని తొలగించారని, మిగిలిన జిల్లాల్లో విధుల్లో కొన సాగిస్తున్నారని ఆరోగ్య సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పేడాడ సూరప నాయుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, ఎస్.మురళీధర్, తంగి గురయ్య, నాగళ్ల మురళీధర్, రాము, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వ్యక్తిగత సమస్యలతో పాటు సామాజిక అవసరాలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మత్స్యకార గ్రామాల నుంచి పలువురు యువకులు వినతిపత్రాలను అందజేశారు. రహదారులు, సిమెంట్ రోడ్లు, కొళాయిల సమస్యలపై నగరంలో వివిధ డివిజన్ల నుంచి వినతులు


శ్రీకాకుళం అర్బన్ : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

స్వీకరించారు. అనంతరం గార మండలం శాలిహుండంకు చెందిన యశ్వంత్ అనే యువకుడు ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో వైద్య సహాయం నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి రూ.2.40 లక్షల చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో గార మండల టిడిపి నాయకులు గొండు వెంకటరమణ మూర్తి, కొంక్యాన ఆదినారాయణ, పీస వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తేవాలని, సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన తదితరులు పాల్గొన్నారు.


పోలాకి : వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రెండో రోజు రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారుల సర్వే


సరిహద్దులు పరిశీలిస్తున్న రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులు

- తేలిన పాఠశాల విస్తీర్ణం
- పాఠశాల మైదానంలోనే షాపులు
- కలెక్టర్‌కు సమగ్ర నివేదిక
- ఆక్రమిత షాపులు తొలగింపే తరువాయి

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు జెడ్‌పి ఉన్నత పాఠశాల మైదానం అక్రమణల నిర్ధారణపై రెండోరోజు శనివారం రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులు జాయింట్ సర్వేను నిర్వహించారు. పాఠశాల పూర్తి విస్తీర్ణం, సర్వేనెంబర్లు తదితర వివరాలతో పాటు ఆర్‌అండ్‌బి రికార్డులను సరిచూసి మరలా రోవర్‌తో సర్వే చేసి నిర్ధారకు వచ్చారు. సర్వే నెంబర్ 200-2ఎ లో 1-57, సర్వే నెంబర్ 208-4లో 3-10 సెంట్లు మొత్తం 4 ఎకరాల 67 సెంట్లుగా రికార్డులు ప్రాప్తికి సరిపోయినట్లు నిర్ధారణ చేశారు. ఇటీవల 'ప్రజాశక్తి'లో పాఠశాల ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, పశువులు షెడ్లు నిర్మాణంతో అక్రమణలకు గురైనట్లు వచ్చిన కథనాలు అంతా వాస్తవమని తేలింది. శనివారం తహశీల్దార్ ఎన్ని జోగారావు, ఆర్‌అండ్‌బి జెఇ ఆంజనేయరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులతో నిర్వహించిన ఉమ్మడి సర్వేలో ఆక్రమణలు నిజమని తేల్చారు. ఎస్‌ఎల్‌ఆర్, ఒన్‌బి, అడంగల్ రికార్డుల ప్రాప్తికి సర్వేకు సరిపోయాయి. కలెక్టర్ సమగ్రమైన నివేదిక ఇవ్వాలని తహశీల్దార్‌కు ఆదేశించడంతో అధికారులు ఒకటికి పదిసార్లు సరి చూసుకొని సర్వే చేసి తుది నివేదికను కలెక్టర్‌కు అందజేసేందు సిద్ధం చేశారు. ఇక అక్రమంగా నిర్మించిన షాపుల తొలగింపు పనులే తరువాయిగా మిగిలాయి. ఈ సందర్భంగా తహశీల్దార్, ఆర్‌అండ్‌బి జెఇ మాట్లాడుతూ పాఠశాల మైదానం, ఆర్‌అండ్‌బి స్థలం రెండు శాఖల సమన్వయంతో ఉమ్మడి సర్వే నిర్వహించామని, సమగ్రమైన నివేదికను తయారు చేశామని, నివేదికను కలెక్టర్ సమర్పించి విపులంగా వివరిస్తామని తెలిపారు. తదుపరి కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆక్రమణదారులకు షాపులు తొలగించమని ఇప్పటికే హెచ్చరించామన్నారు. ఈ సర్వేలో మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, పాఠశాల ఎస్‌ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం పి.జగన్నాధరావు, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, సచివాలయ సర్వేయర్ మజ్జి అయ్యప్పల నాయుడు, కార్యదర్శి దాలినాయుడు, విఆర్ఒ వేణుగోపాలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న రైస్‌మిల్లు కార్మికులు

వేతన ఒప్పందం అమలు చేయాలి

మందస: వేతన ఒప్పందం తక్షణమే అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. మండల కన్వీనర్ కె.కేశవరావు అధ్యక్షతన మండలంలోని సిద్ధాగాం, ఆర్.ఎస్.కె.పురం, సారంగపురం గ్రామాల్లో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇఎస్ఐ, పిఎఫ్ అమలు అమలు చేయకుండా యాజమాన్యాలు అంతా ఒక్కటై చోద్యం చూస్తున్నాయన్నారు. ఒప్పంద కుదుర్చుకుని ఎనిమిది నెలలు అవుతున్నా... యాజమాన్యాల మొండి వైఖరిగా వ్యవహరించం సరికాదన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీలదే కీలకపాత్ర

టెక్కలి : రానున్న విద్యాసంవత్సరం నుంచి అమలు కానున్న ప్రీ ప్రాథమిక విద్యాభివృద్ధిలో అంగన్వాడీలదే కీలకపాత్ర అని ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అంగన్వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణను శనివారం సందర్శించారు. కేంద్రం నిర్వహణ, విద్యా బోధనపై దృష్టిసారించాలన్నారు. కోర్సుల డైరెక్టర్లుగా మక్కా దనుంజయరెడ్డి, మోహనరావు, జి.శ్రీనివాసరావులు వ్యవహరించారు. సిడిపిఒలు జ్ఞానేశ్వరి, సమద్యారాణి, వి.లక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధం

టెక్కలి: ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. టెక్కలి రెవెన్యూ డివిజన్ కార్యాలయం పరిధిలో 9 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే కేంద్రాలను ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొమ్మిది మండలాల్లో 1053 మంది ఓటర్లు ఎన్నికల్లో పాల్గొనున్నారు. వీరిలో 780 మంది పురుషులు, 273 మంది మహిళలు ఓటుహక్కుని వినియోగించు కోను న్నారు. టెక్కలి 254, సంతబొమ్మాళి 52, కోట బొమ్మాళి 112, పాతపట్నం 270, మెళియాపుట్టి 99, కొత్తూరు 103, హిరమండలం 70, ఎల్ఎన్‌పేట 27, సారవకోట 66 మంది చొప్పున్న ఓటింగ్‌లో పాల్గొనున్నారు.

డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణ

పలాస : క్షేత్ర స్థాయిలో నేరాలు నియంత్రణకు డ్రోన్ కెమెరాలు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అపారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో డ్రోన్ కెమెరాలతో వరిసరాలను శనివారం పరిశీలించారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- పోలాకి

ఎపి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ సూచించారు. మండలంలోని ఈదులవలస ఏపి మోడల్ స్కూల్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 24 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అలాగే ప్రవేశ పరీక్ష ఏపి మోడల్ స్కూల్‌లో ఏప్రిల్ 20న ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు నిర్వహించనున్నట్లు తెలిఆపరు. ఈ దరఖాస్తు చేసుకునేందుకు ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.75, ఒసి, బిసి విద్యార్థులు రూ.150 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరారు.

కవిటి : మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 6301062819, 9515015133 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బూర్జ: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఒవిపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. చేసుకున్న విద్యార్థులు ఏదైనా ప్రభుత్వం గుర్తించిన పాఠశాలలో ఐదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు స్కూల్ పనివేళల్లో 7072735070, 9494357139, 9550331946 నంబర్లకు సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న సైంటిస్ట్ రాజు

కేన్సర్ పరిశోధనలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేన్సర్ వ్యాధి విస్తృతమవుతున్న నేపథ్యంలో నివారణ కోసం జరుగుతున్న తాజా పరిశోధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ లలిత పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో కేన్సర్‌పై తాజా పరిశోధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు సదస్సులో అధ్యక్షత వహించారు. సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఎ.రాజు బగిడి మాట్లాడుతూ కేన్సర్ చికిత్సలో నాన్ కోడింగ్, ఆర్‌ఎన్‌ఎల పాత్ర అనే అంశంపై మాట్లాడారు. సైంటిస్ట్-డి విధానాన్ని ఉపయోగించి రొమ్ము కేన్సర్ కణాల విశ్లేషణపై ఆయన వివరించారు. కేన్సర్ స్టెమ్‌సెల్ రూపకల్పనలో భాగమైన ఎంఐ ఆర్‌ఎన్‌ఎ కార్యాచరణ విశ్లేషణ జరగాలన్నారు. రొమ్ము కేన్సర్ నిర్ధారణ చికిత్స కోసం కొత్త బయో మార్కర్లు గుర్తించడానికి ఈ పరిశోధన ఎంతగానో సహాయపడుతుందన్నారు. రొమ్ము కేన్సర్ రోగులకు ప్రత్యేకమైన జీన్ ఎక్స్‌ప్రెషన్ ప్రొఫైల్‌ను పరిశోధన ద్వారా గుర్తించామన్నారు. రొమ్ము కేన్సర్ అభివృద్ధిని అధ్యయనం చేయడానికి 'ఇన్విట్రో మోడల్ అభివృద్ధి'పై జరుగుతున్న పరిశోధనలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల లైఫ్ సైన్స్ అధ్యాపకులు, పీజీ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలను కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బెండి సర్పంచ్ మల్లేశ్వరరావు నివాసం వద్ద కేక్ కట్ చేసి అందిరికీ పంచిపెట్టారు. పలాస నియోజకవర్గ అభివృద్ధిలో మంత్రిగా తన దైన ముద్ర వేశారని కొనియాడారు. మొదటి నుంచి వైద్యునిగా గుర్తింపు తెచ్చుకుని సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పేదల పక్షపాతిగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు తిర్రి రాజారావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైసిపి జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వర రావు, మాజీ అధ్యక్షులు పి.గురయ్య నాయుడు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పలాస : మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పట్టణ వైసిపి ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా పలాస ప్రగతి భవన్ వద్ద హనుమంతు వెంకటరావు దొర ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే మండలంలోని తర్లకోట పంచాయతీ దానగర్‌లో సర్పంచ్ కొర్ల సంతోష్ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు దువ్వాడ రవి, జెడ్‌పిటిసి ప్రతినిధి ధనరాజ్, సౌత్ శంకరరావు, బొడ్డు సుధాకర్, యేసయ్య, షవర్ లక్ష్మణరావు, జనగా సీతారాం పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు : కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- పలాస


యశంత్ (ఫైల్)

పలాస సూర్యతేజ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బుడుమూరు యశ్వంత్ (17) అనే విద్యార్థి శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. పోలీసులకు తండ్రి బుడుమూరు దుర్గారావు అందించిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. యశ్వంత్ తల్లిదండ్రులు పద్మనాభపురం, శివాజీ నగర్ కాలనీలో నివాసం ఉంటూ ఇటుకలు తయారు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. యశ్వంత్ ఈ నెల 20న ఒడిశా ప్రాంతం విక్రంపురంలో ఓ వివాహానికి వెళ్లాడు. అనంతరం ఇంటికి చేరుకున్నారు. దీంతో యశ్వంత్ తల్లిదండ్రులు ఇంటర్ పరీక్షలు సమయం దగ్గర పడుతుండగా వివాహానికి ఎందుకు వెళ్లావని మందలించారు. దీంతో యశ్వంత్ శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే కాలేజీకి వెళ్తానని ఇంటి వద్ద చెప్పారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అధ్యాపకులను సంప్రదించారు. యశ్వంత్ కళాశాలకు రాలేదని సమాధానం ఇచ్చారు. అనంతరం తమ బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభ్యంకాలేదు. చివరకు రాత్రి 9.30 గంటల సమయంలో వారు ఇటుకలు తయారు చేసుకుంటున్న ప్రాంతం ఆర్జిపి కాలనీలోని ఇంటి మేడపై కిటికీకి ఉరివేసుకోవడాన్ని గుర్తించారు. తల్లిదండ్రులు రోదనల మధ్య కిందకు దించి చూడగా... అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్మీ విశ్రాంత జెసిఒ మృతి


జానకిరావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లికి చెందిన కాస జానకిరావు (69) శనివారం తన నివాసంలో తుది శ్వాస విడిచారు. మృతుడు ఆర్మీలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి దేశ రక్షణలో ఎన్నో సేవలను అందించి జూనియర్ కమాండెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందారు. విశ్రాంతి తరువాత హెచ్‌పిసిల్ కంపెనీలో సెక్యూరిటీ సూపవైజర్‌గా విధులు నిర్వహించారు. స్వగ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుచుకున్నారు. మృతుడికి భార్య పార్వతమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

హాస్టల్ అప్పారావు మృతి

రణస్థలం: మండల కేంద్రానికి చెందిన ఎన్నెటి చిన్నఅప్పారావు (65) (హాస్టల్ అప్పారావు) శనివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. వివరాల్లోనికి వెళితే.. లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన ఎన్నెటి చిన్నఅప్పారావు రణస్థలం మండల కేంద్రంలో ఉన్న బిసి హాస్టల్‌లో కుక్‌గా పనిచేసి ఐదేళ్ల కిందట పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ తరువాత రామతీర్థం రోడ్డులో పాన్‌షాప్ పెట్టి రకరకాల కిళ్లీలు కట్టి అమ్ముతూ చాలా ఫేమస్ అయ్యారు. రణస్థలం, లావేరు మండలాలతో పాటు చాలా ప్రాంతాల్లో కిళ్లీలు అమ్మిన హాస్టల్ అప్పారావు అంటే తెలియని వారు ఉండరూ. ఈయన మృతితో పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఆవులు తరలిస్తున్న వాహనం సీజ్

ఆమదాలవలస: కబేళాలకు తరలిస్తున్న గోవుల వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఎదురుగా అలికాం - బత్తిలి ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో హిరమండలం మండలంలోని చిన్న కొల్లివలస నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఆ వాహనంలో మూడు ఆవులు, రెండు దూడలను గుర్తించినట్టు తెలిపారు. వాహనంలోని వ్యక్తులను ప్రశ్నించగా సరైన సమాధానం రాకపోవడంతో కబేళాకు తరలిస్తున్నట్లు నిర్ధారించి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆవులను విజయనగరం జిల్లా గుర్ల మండలం గుజ్జింగవలస గోశాలకు తరలించి, వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరుపర్చినట్టు ఎస్ఐ తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి- మందస

మండలంలోని లొహరిబంధ పంచాయతీ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ బుఖారిణిని సస్పెండ్ చేసినట్లు ఎంపిడిఒ రమేష్‌నాయుడు శనివారం తెలిపారు. సర్వీస్ ఛార్జ్ పేరుతో రూ.96 వేలు వసూలు చేశారని, ఆ డబ్బులను ప్రభుత్వానికి చెల్లించకుండా సొంతానికి ఉపయోగించుకున్నాడని తెలిపారు. ఆయనపై విచారణ అనంతరం జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.


ఆట వస్తువులను అందజేసిన శివప్రకాష్

ఆట వస్తువులు వితరణ

టెక్కలి రూరల్ : మండలంలోని బొరిగిపేటలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు డిజైనర్ రాక్స్ ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీరామోజు శివప్రకాష్ ఆట వస్తువులు, స్కూల్ బ్యాగ్‌లు శనివారం అందజేశారు. పాఠశాలలో చదువుతున్న 140 మంది విద్యార్థులకు రూ.1.30 లక్షల విలువైన పరికరాలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. పంచాయతీలో నడుపుతున్న గ్రానైట్ పరిశ్రమలు పాఠశాల అభివృద్ధి కృషి చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో డిజైనర్ రాక్స్ కంపెనీ మేనేజర్ నారాయణ, సొర్ర రామరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.సురేష్‌కుమార్, చైర్మన్ అల్లు మాధవరావు, మేఘవరం ఉప సర్పంచ్ దివ్వల కామన్న, ఎంపిటిసి మాజీ సభ్యులు కెల్లి శ్రీరాములు, బమ్మిడి రాజు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటు

ఇచ్ఛాపురం : నేరాల నియంత్రణకు ఉపయోగపడే సిసి కెమెరాలకు పంచాయతీల్లో స్పందన వస్తుందని రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఇందులో భాగంగా మశకాపురంలో మూడు ప్రాంతాల్లో శనివారం సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. మిగిలిన పంచాయతీల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

క్వారీ కార్మికులపై దందా

పోలీసులకు కార్మికుల ఫిర్యాదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస మండలాలకు చెందిన క్వారీ కార్మికులపై ప్రభుత్వ ఉపాధ్యాయుడు దందా చేస్తూ వ్యవహరిస్తున్న తీరుపై కార్మికులు నిరసన తెలుపుతూ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. బూర్జ మండలం కొరగాం రెవెన్యూ పరిధిలో ఉన్న ముంగెన్న కొండపై 20 ఏళ్ల నుంచి 150 కుటుంబాలు రాళ్ల తవ్వకాలతో జీవనోపాధి పొందుతున్నామని కార్మికులు తూలుగు శ్రీరాములు, జి. సింహాచలం, జి.చంద్ర, గుజ్జల రమణ, తాడేల మల్లేష్, తాడేల కృష్ణ, వి.రమణ, పిట్ట దాలయ్య విలేకరులకు వివరించారు. ముంగెన్న కొండ పరిసర ప్రాంతాల్లో ఆనుకుని ఉన్న ప్రభుత్వ డీ పట్టా భూములను సుమారు ఐదెకరాలు రొట్టవలస గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొనుగోలు చేసి క్వారీ కార్మికులపై పెత్తనం చెలాయిస్తున్నాడని వారు ఆరోపించారు. క్వారీ ప్రాంతానికి చేరుకోవాలంటే తాను కొనుగోలు చేసిన ప్రభుత్వ భూముల్లో నడవడానికి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ దందా సాగిస్తున్నాడని, తమకు బతుకు తెరువు లేక గడచిన పదేళ్ల నుంచి నెలవారి సుంకం చెల్లిస్తూ కూలి పని చేసుకునే వాళ్ళమని కార్మికులు తెలిపారు. గత కొంత కాలం నుంచి క్వారీలో సరైన ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లామని అక్కడ కూడా పనులు లేక పొట్ట చేత పట్టుకుని తిరిగి స్వగ్రామానికి చేరుకున్నామని తెలిపారు. మళ్లీ క్వారీ పనితో కుటుంబాలను పోషించుకోవాలన్న ఆలోచనతో ఇటీవల రాళ్ల తవ్వకాలకు వెళ్లగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు అడ్డుకొని ప్రతినెల ఒక్కో క్వారీ కార్మికుల బృందం రూ.10 వేలు చెల్లిస్తేనే డీ పట్టా భూముల్లో నడవడానికి అంగీకరిస్తానని ఆదేశాలు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని క్వారీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పెద్దలకు ఈ సమస్యను పరిష్కరించాలని కోరినప్పటికీ ఉపాధ్యాయుడి గత చరిత్ర తెలిసిన వ్యక్తులు ఎవరూ తమకు న్యాయం చేయలేదని తెలిపారు. చివరకు చేసేదేమీ లేక శుక్రవారం ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ పోలీస్‌స్టేషన్లలో కూడా ఫిర్యాదు చేసి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకొని క్వారీలో రాళ్ల తవ్వకాలు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని, తద్వారా తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పోలీసు అధికారులను కోరినట్లు కార్మికులు తెలిపారు.


సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదును చూపుతున్న కార్మికులు


బూర్జ : కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి

ప్రజాశక్తి- బూర్జ

తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇఒపిఆర్‌డి కె.విజయలక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని ఉప్పినివలసలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గృహిణిలు ఇంటిలోనే చెత్తను పొడి చెత్తగా, తడి చెత్తగా వేరు వేరు చేసి క్లాప్ మిత్రలకు ఇవ్వాలన్నారు. హానికరమైన పదార్థాలను, చెత్తను పారవేయాలన్నారు. ప్రతిఒక్కరు ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించి తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే తుడ్డలి పంచాయతీలో గ్రామ సర్పంచ్ అంపిలి రూపవతి ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంపిలి గణపతిరావు, మండల కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు కరణం మురళీ, ఉప్పినవలస సర్పంచ్ ప్రతినిధి వెంకటరమణతో పాటు అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రణస్థలం రూరల్: మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీలో పరిసరాల పరిశుభ్రతపై గ్రేడ్‌వన్ కార్యదర్శి ప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాలనీ ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త కోసం వివరించారు. కార్యక్రమంలో శానిటేషన్ మేస్త్రి పాణికుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

పొందూరు: మండలం తండ్యాం గ్రామంలో సర్పంచ్ కిల్లారి అప్పలనారాయణమ్మ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ ఆదేశాల మేరకు చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించారు. కార్యక్రమంలో సెక్రటరీ శంకర్రావు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.


రణస్థలం రూరల్ : అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి ప్రసాద్

తండేల్ కథతో మత్స్యకారులకు మనస్తాపం


మాట్లాడుతున్న ముగతమ్మ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తండేల్ సినిమా కథాంశం మత్స్యకారులకు మనస్తాపానికి గురి చేస్తోందని, అందులో రామారావు పాత్రను చిత్రీకరించి మిగిలిన వారికి అన్యాయం చేశారని పలువురు మత్స్య కారులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని ఎన్జీఒ హోంలో మత్స్యకారులు చీకటి గురుమూర్తి, సూరాడ ముగతమ్మ, కోనాడ వెంకటలక్ష్మిలు విలేకర్లతో మాట్లాడారు. పాకిస్థాన్‌కు దొరికిన మూడు బోట్లలో ముగ్గురు తండేల్లు ఉన్నారని బాధిత మత్స్యకారులు వాపోయారు. రచయిత కార్తీక్ తమ గ్రామాలను సందర్శించి సముద్రంలో వేట సమయంలో పడే ఇబ్బందులు, పాకిస్తాన్ పోలీసులకు చిక్కి 14 నెలలు పాటు పడిన కష్టాలను కథావృత్తాంతంతో చిత్రం నిర్మిస్తున్నామని చెప్పి, ఈ అంశాలను వేరెవరికి చెప్పొద్దని చెప్పారన్నారు. 21 కుటుంబాలకు చెందిన మత్స్యకారులకు చెరో రూ.45 వేలు అందజేశారని, గణగళ్ల రామారావు, ఎర్రయ్యలకు చెరో రూ.90 వేలు చొప్పున ఇచ్చారన్నారు. ఆతర్వాత సినిమా పూర్తి చేసుకుని హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కు అందులో నలుగురిని మాత్రమే పిలిచి మిగిలిన వారిని విస్మరించారన్నారు. శ్రీకాకుళంలో నిర్వహించిన సక్సెస్ మీట్‌కు పిలిచి కనీసం వేదిక వద్దకు రానియలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 21 మంది బాధితులు ఉంటే కేవలం రామారావుకు రూ.లక్షలు కుమ్మరించారని వివరించారు. బాధలు పడ్డ మత్స్యకారు లందర్నీ ఒకే రీతిలో సినిమా యూనిట్ చూడాలని, బాధితులకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో బాధిత మత్స్యకారులు కె.అప్పారావు, కిషోర్, పి.మణి, రాజు, భవిరోడు, గురువులు, వి.శ్యామ్యూల్, అప్పన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎల్‌సి గేట్ సరిచేయాలి


వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస రౌలో

ప్రజాశక్తి- కవిటి

అంపురం రైల్వే గేటు వద్ద వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఎల్‌సి గేటు సరిచేసి అటువైపుగా వెళ్లే సుమారు 50 గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగించాలని జడ్ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాస్ రౌలో కోరారు. ఈ మేరకు శనివారం సోంపేట పిడబ్ల్యూ ఇంజినీర్ ఎస్.ఎన్.పండాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల ఆంపురం ఎల్‌సి గేటు వద్ద రైల్వే ఇంజినీర్లు ట్రాక్ మరమ్మతులు చేసినప్పుడు ఎల్‌సి గేట్ మధ్య ఎత్తు బాగా పెరిగిపోయిందని అన్నారు. దానివల్ల ఎం.ఎస్.పల్లి వైపు వెళ్లే సుమారు 50 గ్రామాల ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, ఆటో, ట్రాక్టర్, బస్సులు ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. ప్రజల సౌకర్యార్థం తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. ఎల్‌సి గేటు మధ్యన రోడ్డు మరమ్మతులు చేసి వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని ఎడిఎ సత్యవతి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని సంచాం పంచాయతీలో భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా పంటల్లో ఎరువుల వాడకం అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకొని ఆ పరీక్షలు ఫలితాల ఆధారంగా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలని సూచించారు. ఎఫ్‌టిసి వ్యవసాయ అధికారి సూర్యకుమారి మాట్లాడుతూ ఎరువులు వినియోగం అవసరం మేరకు వినియోగించాలన్నారు. పిఎం కిసాన్ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ని రైతులందరూ రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల ఎఒ డి.విజయ్ భాస్కర్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎడిఎ సత్యవతి

ఎర్రగెడ్డ భూముల ఆక్రమణ

వజ్రపుకొత్తూరు: మండలంలోని రెయ్యపాడు, కొండూరు పంచాయతీల పరిధిలో ఉన్న ఎర్ర గెడ్డ భూములు ఆక్రమణలకు గురయ్యాయని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రజక కార్పొరేషన్ డైరెక్టర్ వి.దుర్గారావు తెలిపారు. స్థానిక జనసేన నాయకుల కీలు మాణిక్యవర్మ, బచ్చుల నాగరాజు, బచ్చుల సురేష్‌లతో కలిసి ఉపాధి హామీ పనులు పరిశీలించారు. పరిశీలనలో దాదాపు 50 నుంచి 70 ఎకరాలు పైబడి ఉన్న గెడ్డ భూములను ఇరువైపులా ఉన్న రైతులు ఆక్రమించేసి పూర్తిగా గెడ్డని కబ్జా చేశారని ఆరోపించారు. వర్షం కురిసినప్పుడు చుట్టుపక్కల గల కొండల పైనుంచి వచ్చే నీరు ఈ గెడ్డ ద్వారా ప్రవహించి కొబ్బరి తోటలకు నీరు అందించేదని తెలిపారు. అధికారులు రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఎర్ర గడ్డ ఆక్రమణలకు గురైందని అన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమగ్ర సర్వే చేపించి ఆక్రమణకు గురైన భూములను రక్షిస్తామని తెలిపారు.

సమావేశాలకు సభ్యులు హాజరు కావాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతినెలా నిర్వహిస్తున్న సమావేశానికి స్వయంశక్తి సంఘాల లీడర్లు, సభ్యులు విధిగా హాజరుకావాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మండలంలోని కేసుపురంలో శనివారం గ్రామ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘస్థాయి లావాదేవీలు, గ్రామ సంఘంలో స్థాయిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాజెక్టు కార్యక్రమాలు ప్రతి సంఘం లీడర్లు ద్వారా సభ్యులు తెలుసుకోవాలన్నారు. తద్వారా ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా వస్తున్న రుణాలు, పిఎం సూర్య ఘర్ యోజన, షేడ్ నెట్ వ్యవసాయం, ఈ-శ్రమ్ కార్డు ఉపయోగాలు, హోంకంపోస్టు, కిచెన్ గార్డెన్లో ఏర్పాటు, జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేక కార్యక్రమాలు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. సంఘస్థాయి పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అంతర్గత పొదుపుల నుంచి అప్పులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘ అధ్యక్షులు రేనా, విఒఎ కల్పన పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

టమాటా రైతులను ఆదుకుంటాం


టమాటాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

కలెక్టర్‌తో, వ్యవసాయ మార్కెటింగ్ అధికారులతో చర్చించి టమాటా రైతులకు సరైన గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు చేపడతానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాంలో పండించే టమాటా రైతులు దగ్గరకు శనివారం వెళ్లి మాట్లాడారు. టమాటా ధర్ రూ.10 నుంచి రూ.15 పలుకుతుందని రైతులు చెప్పారు. అనంతరం మాట్లాడుతూ టమాటా రైతులను ఆదుకునేందుకు చర్యలు తీకుంటానని హామీనిచ్చారు. జిల్లాలో సేకరించిన టమాటాలను విజయవాడ, గుంటూరు జిల్లాల రైతుబజార్లో అమ్మకం చేయిస్తానని అన్నారు. తద్వారా రైతులకు సరైన గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు టమాటా కొరత ఉన్న ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో విక్రయించడానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంలో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ˇ టమాటా సుమారు ?10 నుండి 15 రూపాయలు వరకు రైతులకు అందుతుని అన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న వైదా రాజశేఖర్ పరీక్ష సామగ్రిని వితరణగా అందజేశారు. పదోతరగతి పరీక్షలు రాయనున్న 56 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు, స్కేల్‌లు, మూడు రకాల పెన్నులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆయన ఆకాంక్షించారు. పరీక్షలంటే భయం వీడి ఆత్మ విశ్వాసంతో సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బల్ల కంటయ్య, ఉపాధ్యాయులు మెట్ట అనంత భట్లు, గోపాలశెట్టి సాయికుమార్, బ్యాంకు మిత్ర తమ్మినైన ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న రాజశేఖర్

ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలిద్దాం

మున్సిపల్ కమిషనర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించేందుకు మనందరం కృషి చేద్దామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయంలో వ్యాపారస్తుతో, కిరాణా, పాన్, చికెన్ షాపుల యజమానులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు కొనడానికి ఎవరైనా వచ్చినా, అమ్మడం లేదని, మీరు గుడ్డ సంచులు తీసుకొని రావాలని చెప్పాలని అన్నారు. ప్లాస్టిక్ అమ్మకాలతో వ్యాపారస్తులు దొరికినట్లయితే వారికి ప్రభుత్వం రూ.మూడేళ్లు జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తుందని అన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఉదయ్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

గురువుకు సత్కారం


గురువును సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన పూర్వపు గురువు బి.శ్రీరామ్మూర్తిని ఎమ్మెల్యే గొండు శంకర్ సత్కరించారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో శ్రీరామ్మూర్తి దంపతులను ఆయన శాలువ కప్పి సత్కరించారు. సింగుపురంలో హైస్కూల్ విద్యను 1990-91లో పూర్తి చేశానని, ఆసమయంలో తనకు అన్ని విధాలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దారని గుర్తు చేసు కున్నారు. వారి నుంచి ఎన్నో సామాజిక అంశాలను తాను గ్రహించానని చెప్పుకొచ్చారు. తన ఉన్నతికి కారకులైన ఉపాధ్యాయులను సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయనతో పాటు పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి


గురుమూర్తిని సన్మానిస్తున్న విశ్వక్సేన్ తదితరులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

కళాకారులను ప్రోత్సహించాలని ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ విశ్వక్సేన్ అన్నారు. లావేరు మండలం కొత్తకోటలో శ్రీకోటదుర్గ అమ్మవారి ఆలయ 33వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రణస్థలం మండల కేంద్రంకి చెందిన బోనం గురుమూర్తి చేసిన సాంస్కృతిక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. విశ్వక్సేన్‌తో పాటు శివ, ముత్తవారి వంశస్తులు నారాయణరావు, గున్నయ్య, ప్రజలు గురుమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ మరుగున పడిపోతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. కళాకారునిగా నన్ను గుర్తించి, నాకు సన్మానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.


పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ చేస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

పోటీ పరీక్షలకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలానికి చెందిన యువకులు కానిస్టేబుల్ రాత పరీక్షకు అర్హత సాధించిన నిరుద్యోగులకు రణస్థలం హెల్పింగ్ హ్యాండ్స్ సేవాసంస్థ ద్వారా ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ప్రతినిధులు, సభ్యులు మాట్లాడుతూ యువతను ప్రోత్సహించి అన్ని పోటీ రంగాల్లో ముందుకు నడిపించడానికి తమ వంతుగా సహాయాన్ని అందిస్తామని, పోటీ పరీక్షల్లో నెగ్గి యువతకు స్ఫూర్తిగా నిలవాలని, గ్రామానికి మంచి పేరుప్రఖ్యాతలు తేవాలన్నారు. అంతేకాకుండా భవిష్యత్‌లో విద్యార్థుల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు.

వెంకటేశ్వర ఆలయం పరిశీలన

ప్రజాశక్తి- కవిటి

కవిటిలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి టిటిడి శ్రీవాణి ట్రస్టు పథకంలో భాగంగా గతంలో రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో శనివారం విశాఖపట్నం కనకమహాలక్ష్మి అమ్మ ఆలయం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్.వెంకటరమణ, జి.యశ్వంత్‌శ్రీరామ్, ఎఇ సిహెచ్.జితేంద్ర, జి.రమేష్ పరిశీలించారు. ఆలయ నమూనా కొలతలు తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో బి.పాపయ్యరెడ్డి, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, మొగిలిపురి సీతారాం, పి.దుర్యోధన, పిఎం హేమాచలం, రాజేష్, లోకనాథం పాల్గొన్నారు.


ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీడీ అన్నదొర

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఐటిడిఎ పరిధిలోని మెళియాపుట్టి మండలం నేలబొంతు, భీంపురం ఆశ్రమ పాఠశాలలను ఐటిడిఎ డిడి అన్నదొర శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు పునశ్చరణ తరగతులపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనుబాబు

వైద్యుల ఆర్థికసాయం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి చెందిన డాక్టర్ సీపాన శ్రీనుబాబు కుమార్తి అభిషా శనివారం పుట్టినరోజు సందర్భంగా భూలోకం మాతకు చెందిన శ్యామలరావుకు రూ.పది వేలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. శ్యామలరావుకి అనారోగ్యమని తెలిసిన వెంటనే మానవతా దృక్పథంతో ఈ సహాయం అందజేశామని శ్రీనుబాబు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పీత రమణ, బెహరా కొళి, కృష్ణ పాల్గొన్నారు.

'నాగళ్ల'కు గుర్తింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి కార్యకర్తగా సోషల్ మీడియా విభాగంలో విశిష్ట ప్రతిభ కనబరచిన నాగళ్ల మురళీధర్‌కు అరుదైన గుర్తింపు దక్కింది. 2014 నుంచి ఎమ్మెల్యే కూన రవికుమార్ అడుగు జాడలలో టిడిపికి విధేయుడుగా ఉంటూ సోషల్ మీడియా రంగంలో విశేష సేవలందించిన మురళీధర్‌ను పార్టీ గుర్తించింది. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే రవికుమార్ చేతులమీదుగా టిడిపి పార్టీ జెండా ప్రతిమను బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను, పథకాలను, సమాచారాన్ని ప్రజలకు చేరువ చేసిన మురళీధర్‌ను అభినందించారు. టిడిపి కోసం కృషి చేస్తున్న ప్రతిఒక్కరిని పార్టీ గుర్తించి సముచిత గౌరవం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్య నారాయణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మురళీధర్‌కు జెండా ప్రతిమను అందజేస్తున్న ఎమ్మెల్యే

విఒఎలకు శిక్షణ


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- మందస

విఒఎ, ఎస్‌హెచ్‌జి ఆడిటర్లు సభ్యులందరికీ అర్థమైనట్లు పారదర్శకంగా నిర్వహించాలని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండల మహిళా సమాఖ్యలో సవరకాంతమ్మ అధ్యక్షతన విఒఎలకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతి స్వయం శక్తి సంఘ సభ్యులూ కమ్యూనిటీ ఆడిటర్లతో ఆడిట్ చేయించుకుని రిపోర్టును మండల సమాఖ్యకు సమర్పించాలి. ప్రతి గ్రామ సంఘమూ రసీదులు, ఓచర్ల ఆధారంగా నగదు పుస్తకం, లోన్ లెడ్జర్, జనరల్ లెడ్జర్, డిసిబిలతో ఆదాయ వ్యయాల ఖాతా, ఆస్తి బాధ్యతల పట్టిక సక్రమంగా తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ సాయిరాం, అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు పాల్గొన్నారు.

పారదర్శకంగా కులగణన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

షెడ్యూల్డ్ కులాల జాబితాలో ఉన్న వారి కులగణన పారదర్శకంగా జరిపించాలని దళిత జెఎసి నేతలు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో శనివారం జెఎసి నాయకులు తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణు హాజరై ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం చేపట్టిన కులగణనలో లోపాలు ఉన్నాయని, ఎస్‌సి కులాల జనాభా ఆధారంగా ప్రస్తుత ప్రభుత్వం వర్గీకరణ చేపడుతోందని, దీనివల్ల ఎస్‌సి వర్గాలకు నష్టం జరిగే ప్రమాదముందన్నారు. నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో గల అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు ఏప్రిల్ 14లోగా పూర్తి చేయాలన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెఎసి నాయకులు


రికార్డులను పరిశీలిస్తున్న పీడీ సుధాకరరావు

కూలీలకు రూ.300 వచ్చేలా చూడాలి

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలం ఉపాధిహామీ కార్యాలయాన్ని జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.సుధాకరరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మండల కంప్యూటర్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో పలు పనులను సందర్శించారు. ప్రతి పంచాయతీలో ఉపాధిహామీ ద్వారా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫారం పాండు, ఇంకుడు గుంతలు, కంపోస్ట్ పిట్ పనులను ప్రారంభించాలన్నారు. కూలీలకు రూ.300 వేతనం వచ్చేలా కొలతల ప్రాప్తికి పని చేయించాలన్నారు. ఈయనతో ఎంపిడిఒ టి.రామకృష్ణ, ఎపిఒ సత్యనారాయణ, ఇసి, టిఎలు, సిఒలు ఉన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు

రణస్థలం రూరల్: గంజాయి నియంత్రణ చర్యల్లో భాగంగా శనివారం రణస్థలంలోని పలు ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సిఐ అవతారం ఆదేశాలతో ఎస్ఐ చిరంజీవి నేతృత్వంలో ఎఎస్ఐ రమణమూర్తి ఆధ్వర్యంలో ఈ సోదాలు చేశారు. మండల పరిధిలోని పాన్‌షాప్‌లు, మార్కెట్‌లో షాపులను నిశితంగా పరిశీలించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

గోశాల ఎత్తివేత

టెక్కలి: మండలంలోని భగవాన్‌పురంలో ఇటీవల ఏర్పాటు చేసిన గోశాలని శనివారం నుంచి మూసివేస్తున్నట్లు నిర్వాహకులు హరికృష్ణ తెలిపారు. కొద్ది నెలల క్రితం తెరిచిన ఈ గోశాల నిర్వహణ ఇక అవసరం ఉండదని భావించి మూసివేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు తమ గోశాల్లో ఉన్న ఆవులను సంబంధిత రైతులకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పొన్నాడ రాజారావు, పంగ మన్మథరావు, పొన్నాడ సాదినాయుడు, సింహచలం పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

టెక్కలి : ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యాన ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు జెఇఇ, మెయిన్స్, నీట్ ఎంసెట్ నమూనా పరీక్షలను ఇటీవల నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సమితి జిల్లా అధ్యక్షులు తలసముద్రం సూర్యం తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పారద్రోలేందుకు నమూనా పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంసెట్‌లో కె.చరన్, హర్షవర్ధ, నీట్‌లో కీర్తన, ఆస్మిత, గౌతమిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, రమేష్, మధు, పాపారావు, శ్రీని, నాగరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా సిసి రోడ్డు పనులు

కొత్తూరు : మండల కేంద్రంలోని చోడవరపు వీధి, బొరవీధిల్లో ఉపాధి హామీ నిధులు రూ.లక్షలతో సిసి రోడ్లను శనివారం నిర్మించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చోడవరపు రాము, ముగితి కృష్ణారావు, పాలవలస గోవిందరావు, చోడవరపు వెంకటరమణ, కర్నెన రామారావు, చోడవరపు లోకేష్, లంకవలస రామారావు, చోడవరపు ఉపేంద్ర, గేదెల ప్రసాద్, ఆశపు గణేష్ పాల్గొన్నారు.

క్లస్టర్ల మదింపు

టెక్కలి : నూతన విద్యా విధానం అమలులో భాగంగా క్లస్టర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలో పాఠశాలల సముదాయాలను మదింపు చేపట్టారు. గతంలో పదిగా ఉన్న పాఠశాల సముదాయాలు ఇప్పుడు ఆరు క్లస్టర్లుగా మారాయి. రద్దయిన భూరగాం, తలగాం, ఎట్.నౌపడా ఆర్ఎస్, సీతాపురం పాఠశాలల సముదాయాలను సమీపంలో ఉన్న క్లస్టర్ సముదాయాల్లో కలిపి వేశారు. ఇందులో భాగంగా లింగాలవలస, పోలవరం, చాకిపల్లి, నర్సింగపల్లి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల్లో క్లస్టర్ సముదాయాలు నిర్వహించనున్నారు. కాగా, విలీనం చేసిన సముదాయాల్లో ఉన్న సిఆర్‌పిలను మిగులు సిబ్బందిగా భావించి మండల రీసోర్సు కేంద్రంలో వినియోగించనున్నారు. కాగా, భూరగాం పాఠశాల సముదాయం పరిధిలోని పాఠశాలలను నర్సింగపల్లి క్లస్టర్‌లో విలీనం చేయడంపై ఆయా పరిధిలోని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి- పలాస

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ ప్రతినిధులు సిహెచ్.మురగన్, కె.వెంకటి, బి.కుర్మారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ ఎన్.రామారావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కోరారు. పనిముట్లు ఇవ్వాలన్నారు. పాడైనా తోపుడు బండ్లకు మరమ్మతలు చేయాలన్నారు. మున్సిపాలిటీలో తగిన కార్మికులను భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.రవి, బాలకృష్ణ, రమేష్, రాము పాల్గొన్నారు.


సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపిటిసి, నాయకులు

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- పొందూరు

మండలం కింతలిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గొల్లవీధిలో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణానికి శంకుస్థాపనకు శనివారం ఎంపిటిసి కూటికుప్పల హనుమంతరావు ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. సుమారు రూ.25 లక్షలతో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అసిరినాయుడు, కూన శ్రీను, లోకనాథం, కూటికుప్పల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గోకర్ణపురంలో ఎస్ఐ పల్లెనిద్ర

మెళియాపుట్టి : మండలంలోని గోకర్ణపురంలో శుక్రవారం రాత్రి ఎస్ఐ పి.రమేష్‌బాబు పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శాంతిభద్రతలు విగాదం కలగకుండా ఐక్యమత్యంతో మెలగాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలన్నారు. అలాగే తదితర సమస్యలను విని తన వంతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.